క్లుప్తంగా

నందిగామ ప్రాంతంలో భారీ వర్షం



నందిగామ: నందిగామ ప్రాంతంలో మంగళవారం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఒక్కసారిగా వాతావరణం మారి భారీ వర్షం కురిసింది. వర్షం కారణంగా వాతావరణం చల్లబడింది. ఇదిలా ఉండగా ఈ వర్షం పంటలకు ఎంతో మేలు చేస్తుందని రైతులు చెబుతున్నారు.

రేపు ప్రభుత్వ కళాశాలలో అతిథి అధ్యాపకులకు ఇంటర్వ్యూ

కంచికచర్ల: కంచికచర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తులు కోరుతున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ హఫీజ్ షేక్ అహ్మద్ మంగళవారం తెలిపారు. జువాలజీ, బోటనీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ(ఎఫ్) నర్సింగ్ ఒకేషనల్ కోర్సులు బోధించేందుకు అధ్యాపకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. సంబంధిత సబ్జెక్టులలో పోస్టు గ్రాడ్యుయేషన్‌లో 50 శాతంతో కృతార్థులైన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 7వ తేదీ ఉదయం 11గంటల నుంచి కళాశాలలో ఇంటర్వ్యూలు జరుగుతాయని, ఆసక్తిగల అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరు కావాలని తెలిపారు.

బీజేటీ డిగ్రీ కళాశాలలో గ్రాడ్యుయేషన్ డే



కీసర(కంచికచర్ల): మండలంలోని కీసర బీజేటీ డిగ్రీ కళాశాలలో మంగళవారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలు జరిగాయని కళాశాల ప్రిన్సిపాల్ బ్రదర్ పోలవరపు సుధీర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన లసాల్ కాంగ్రిగేషన్ సంస్థ అధిపతి బ్రదర్ అమలన్ మాట్లాడుతూ సాంకేతికతతో నడిచే పోటీ ప్రపంచంలో నైపుణ్యాలకు పదును పెట్టి ఉన్నత స్థాయికి ఎదగాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి బ్రదర్ ఆంథోనీ, అడ్మినిస్ట్రేటివ్ అధికారి దుగ్గిరాల ప్రకాష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



జగ్గయ్యపేటఅర్బన్: శ్రీకృష్ణుని జన్మదినాన్ని పురస్కరించుకుని స్థానిక విజ్ఞాన్ హైస్కూల్‌లో మంగళవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు కనులపండువగా జరిగాయి. సుమారు 72 మంది గోపికలు, 34 మంది కృష్ణులతో సంబరాలు నిర్వహించాయి. స్కూల్ డైరెక్టర్ తన్నీరు సుధారాణి మాట్లాడుతూ విద్యార్థులకు శ్రీకృష్ణాష్టమి విశిష్టతను వివరించారు. వేడుకల్లో ఉట్టి కొట్టే కార్యక్రమం ఆద్యంతం ఉత్సాహంగా సాగింది.

ప్రియుడు మోసగించాడని యువతి ఆత్మహత్యాయత్నం

కంచికచర్ల: ప్రేమ పేరుతో ఓ యువకుడు మోసగించటంతో మనస్తాపం చెందిన యువతి మెడ, చెయ్యిపై బ్లేడుతో కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ పీవీఎస్ సుబ్రహ్మణ్యం కథనం మేరకు కంచికచర్ల మండలం పేరకలపాడు గ్రామానికి చెందిన ఓ యువతి అదే గ్రామానికి చెందిన పిల్లి సతీష్ అనే యువకుడు గత రెండేళ్ల నుంచి ప్రేమించుకుంటున్నారు. అయితే తనను పెళ్లి చేసుకోమని సోమవారం రాత్రి ఆ యువతి సతీష్‌ను అడగ్గా ఆ యువకుడు నిరాకరించటంతో మనస్తాపం చెందిన యువతి తన ఇంటి వద్ద చేతిపైన, మెడపైన బ్లేడుతో కోసుకుంది. అధిక రక్తస్రావం కావడంతో గమనించిన ఆమె కుటుంబసభ్యులు ఆమెను నందిగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు సతీష్‌ను అరెస్ట్ చేసి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సుబ్రహ్మణ్యం తెలిపారు.

పాఠశాలకు పూర్వ విద్యార్థుల వితరణ

తిరువూరు: స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థుల సంఘం (తోసా) సభ్యులు గ్రంథాలయ పుస్తకాలు, కంప్యూటర్ మంగళవారం వితరణ ఇచ్చారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని తోసా ఆధ్వర్యంలో పాఠశాలలో ఉపాధ్యాయులను సత్కరించిన తోసా బృందం ఇటీవల ట్రిపుల్‌ఐటీలో సీట్లు సాధించిన షేక్ ముబీనా, పిట్టా స్ఫూర్తిలకు నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. తోసా గౌరవాధ్యక్షుడు కలకొండ రవికుమార్ పాల్గొన్నారు.

భావితరానికి జ్ఞానప్రదాతలు ఉపాధ్యాయులు

వత్సవాయి: సమాజంలో ఉపాధ్యాయుడిది అత్యుత్తమ స్థానమని, భావి తరానికి వారు జ్ఞాన ప్రదాతలని ఎంపీపీ కొలుసు రమాదేవి అన్నారు. గురుపూజోత్సవ సందర్భంగా వత్సవాయిలోని ఆర్యవైశ్య కల్యాణమండపంలో మంగళవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన జక్కా రవీంద్రనాథ్(భీమవరం), యు.ప్రసాదరావు (మాదినేనిపాలెం), పి.సీత (వత్సవాయి), హెచ్.మోహనరావు(కంభంపాడు), జి.రవికుమార్ (మంగొల్లు), మోంగ్యా(మంగొల్లు), ఎం.మణి(వత్సవాయి), షేక్ జానీ(మక్కపేట), పుష్పలత(కన్నెవీడు)లను ఘనంగా సన్మానించారు. గురుపూజోత్సవం సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయుల వేషధారణలో సందడి చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ భూక్యా సీతమ్మ, జెడ్పీటీసీ యేశపోగు దేవమణి, తహసీల్దార్ వైకుంఠరావు, ఎంపీడీవో సీహెచ్ చెన్నారావు, ఆర్యవైశ్య సంఘ మండల అధ్యక్షులు బొగ్గవరపు వెంకట రాజారావు, ఎంఈవోలు ఆదూరి వెంకటరత్నం, ఎల్.నాగరాజు యూనియన్ నాయకులు వై.మల్లేశ్వరరావు(వైఎస్సార్ టీఎఫ్), పి.ఆనంద్‌కుమార్(ఎస్టీయూ), మోంగ్యా(డీపీఆర్టీయూ), పి.వెంకటేశ్వర్లు(యూటీఎఫ్), జి.పుల్లయ్య(ఏపీటీఎఫ్) ఎ.సుధాకర్(పీఆర్టీయూ) పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలులో ఘనంగా గురుపూజోత్సవం

పెనుగంచిప్రోలు: గురుపూజోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక తంబరేణి గార్డెన్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ముందుగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మండలంలోని పలు పాఠశాలలకు చెందిన ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన జీనత్, శెట్టిపోగు రాములుకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మార్కపూడి గాంధీ మాట్లాడుతూ భవిష్యత్తు నిర్మాతలుగా విద్యార్థులను తీర్చిదిద్దే బాధ్యత గురువులదేనన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్వీ ప్రసాద్, వైస్ ఎంపీపీలు గుంటుపల్లి వాసు, కనగాల శ్రీను, ఎంఈవో డి.రవీంద్రనాథ్, పీఆర్టీయూ నాయకులు ఆవుల రాంబాబు, చాట్ల నిరంజన్, సునీల్, భూపతిరావు, కరీముల్లా, జాఫర్, శివకుమార్, పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

వాడవాడలా ఉపాధ్యాయ దినోత్సవం

జగ్గయ్యపేటఅర్బన్: మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని పట్టణంలో మంగళవారం పలు విద్యా సంస్థలు, సంఘాల ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్‌లో విద్యార్థులు సెల్ఫ్ గవర్నమెంట్ కార్యక్రమాన్ని ప్రదర్శించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా అన్ని తరగతులకు పాఠాలు బోధించారు. హెచ్‌ఎం.మాధవీలత మాట్లాడుతూ గురు ప్రాధాన్యతను వివరించారు. ఉపాధ్యాయులు బాదె నాగేశ్వరరావు, కరుణాకర్, నాగమణి, స్వర్ణలత, బేబి శాంతి, సౌందర్య ఈ కార్యక్రమాన్ని ఏర్పాటుచేయగా, స్టాఫ్ సెక్రటరీ మౌలాలి, ఇన్‌చార్జ్ హెచ్‌ఎంలు కృష్ణయ్య, శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

వివిధ పాఠశాలల్లో...

నైతిక విలువలు కాపాడే బాధ్యత ఉపాధ్యాయులదే అని విజ్ఞాన్ హైస్కూల్ డైరెక్టర్ తన్నీరు సుధారాణి అన్నారు. స్థానిక విజ్ఞాన్ హైస్కూల్‌లో స్కూల్ యాజమాన్యం ఉపాధ్యాయ బృందానికి ఏర్పాటుచేసిన అభినందన కార్యక్రమంలో ఉత్తమ సేవలందించిన ఉపాధ్యాయులు సీతారామయ్య, పద్మజ, దుర్గ, సుమలత, రాధిక, లక్ష్మిలను సత్కరించారు. చింతలతోపులోని శ్రీగౌతమి హైస్కూల్‌లో చిన్నారులు ఉపాధ్యాయుల వేషధారణలో అలరించారు. ప్రిన్సిపాల్ బొల్లా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను సన్మానించారు.

రిటైర్డు ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో...

స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఉన్న ధరణికోట వారి పెన్షనర్స్ భవన్‌లో రిటైర్డ్ ఉద్యోగుల అసోసియేషన్ వారు ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు విజయలక్ష్మి, కమలకుమారి, సత్యనారాయణ, పకీర్‌సాహెబ్, వినోద్‌బాబు, భూషణంలను సన్మానించారు. సంఘ అధ్యక్షుడు వినోద్ బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు ఘనీ, పూర్ణచంద్రరావు, ముత్యాలరావు, మరియదాసు, జీవరత్నం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

జగ్గయ్యపేట: మండలంలోని ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని ధర్మవరప్పాడు తండాలో మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ముక్త్యాల గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు సెల్ఫ్ గవర్నెన్స్ నిర్వహించి ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు టీవీఎల్ నరసింహారావు, రామలక్ష్మి, అంజమ్మ, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

వీరులపాడులో ఉపాధ్యాయ దినోత్సవం

పెద్దాపురం(వీరులపాడు): విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకువచ్చేలా విద్యార్థులు చదువులో రాణించాలని ఎంపీపీ కోటేరు లక్ష్మి అన్నారు. మండలంలోని పెద్దాపురం గ్రామంలోని హిందూ ప్రభుత్వ యూపీ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి ఆమె పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం పలువురు ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ నిప్పులపల్లి శాంతమ్మ, పాఠశాల కమిటీ చైర్మన్ తులసి, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల వేషధారణలో విద్యార్థులు

నందిగామ: నియోజకవర్గ వ్యాప్తంగా ఉపాధ్యాయ దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఉత్తమ సేవలందిస్తున్న ఉపాధ్యాయులను గుర్తించి ప్రత్యేకంగా సన్మానించారు. పలు పాఠశాలల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించి అలరించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండలంలోని లింగాలపాడు జిల్లా పరిషత్ పాఠశాల, పల్లగిరి గ్రామంలోని ఎంపీయూపీ, రామిరెడ్డిపల్లి గ్రామంలోని ఎంపీయూపీ పాఠశాలల్లో గురుపూజోత్సవం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాల, రామకృష్ణ విద్యా నికేతన్, కాకతీయ-అపోలో పాఠశాలల్లో గురు పూజోత్సవం నిర్వహించారు.

కంచికచర్లలో...

కంచికచర్ల: అజ్ఞానాంధకారాన్ని తొలగించి, జ్ఞానం అనే వెలుగును ప్రసాదించే వారు గురువులని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు వేమా సురేష్‌బాబు అన్నారు. గురు పూజోత్సవం సందర్భంగా విశ్రాంత ఉపాధ్యాయుడు షేక్ దస్తగిరి దంపతులను మంగళవారం పూలమాలలు, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు వేమా రోజారమణి, దీక్షా కళాశాల కరస్పాండెంట్ షేక్ రజీమ్ తదితరులు పాల్గొన్నారు.

కంచికచర్ల శాఖా గ్రంథాలయంలో మంగళవారం గురుపూజోత్సవం సందర్భంగా మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అమ్రితసాయి ఇంజినీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శశిధర్‌ను కళాశాల కరస్పాండెంట్ కె.రామ్మోహన్‌రావు శాలువాతో సత్కరించారు. మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో గురుపూజోత్సవం నిర్వహించారు.



పేట విజ్ఞాన్ హైస్కూల్‌లో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న డైరెక్టర్ తన్నీరు సుధారాణి తదితరులు



పేటలోని విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఉద్యోగులను సన్మానిస్తున్న సంఘ సభ్యులు



పెద్దాపురంలో ఉపాధ్యాయ దినోత్సవంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి తదితరులు



పెనుగంచిప్రోలులో రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



నందిగామలోని శ్రీ చైతన్య పాఠశాలలో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న ఆటల పోటీలు



వత్సవాయిలో ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న సహచర ఉపాధ్యాయులు



కంచికచర్లలో విశ్రాంత ఉపాధ్యాయ దంపతులను సత్కరిస్తున్న వేమాసురేష్‌బాబు, ఎంపీటీసీ రోజారమణి



లింగాలపాడు జిల్లా పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయుల వేషధారణలో విద్యార్థులు

అంకిత భావంతో పనిచేస్తే ఉన్నత భవిష్యత్తు

- ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం
- పలువురిని సత్కరించిన ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామటౌన్: ఉపాధ్యాయులు అంకిత భావంతో పనిచేస్తే మంచి పేరుతో పాటు విద్యార్థులకు ఉన్నత భవిష్యత్తు అందించవచ్చని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయులకు ఎంతో ప్రాధాన్యం ఉందన్నారు. భావి తరాల పౌరుల భవిష్యత్తు ఉపాధ్యాయుల చేతిలో ఉందని గుర్తుచేశారు. అనంతరం ఏరోబిక్స్ ట్రైనర్ మహమ్మద్ నూరుద్దీన్‌ను అభినందించి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు చిరుమామిళ్ల చైతన్యకుమార్, పెసరమల్లి శేఖర్, షేక్ కరిముల్లా, రజ్వీ, మన్నెం దాసు, పిల్లి జయరాజు తదితరులు పాల్గొన్నారు.



ఏరోబిక్స్ ట్రైనర్ నూరుద్దీన్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

ఓటీఎస్ ద్వారా పేదలకు శాశ్వత భూహక్కు

మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర

జగ్గయ్యపేటఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన్ టైమ్ సెటిల్మెంట్(ఓటీఎస్) పథకం ద్వారా పేదవారు శాశ్వత భూహక్కు పొందుతున్నారని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర అన్నారు. పట్టణంలో ఓటీఎస్ పథకం ద్వారా గతంలో పట్టాలు ఇవ్వగా, మిగిలి ఉన్న 15 మంది లబ్ధిదారులకు మంగళవారం పట్టాలను చైర్మన్ అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని చైర్మన్ చాంబర్‌లో జరిగిన కార్యక్రమంలో చైర్మన్ రాఘవేంద్ర మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఓటీఎస్ పథకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా అనేకమంది పేదవారు ఇంటి శాశ్వత భూహక్కు పొందుతున్నారన్నారు. తద్వారా బ్యాంకు రుణాలు, ఇతరత్రా సదుపాయాలతో ప్రతి పేదవాని సొంతింటి కల నెరవేరిందన్నారు. ఇంతటి గొప్ప పథకాన్ని ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్లు తుమ్మల ప్రభాకర్, షేక్ హఫీజున్నీసా ఫిరోజ్, కౌన్సిలర్లు వట్టెం మనోహర్, పందుల రోశయ్య, కోఆప్షన్ సభ్యులు షేక్ బషీరున్నీసా, వైఎస్సార్ సీపీ నాయకులు కాశి కిషోర్, పూసాల పుల్లారావు, దువ్వల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పట్టాలను పొందిన లబ్ధిదారులతో మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు

ఓటరు జాబితా తయారీకి రాజకీయ పార్టీలు సహకరించాలి

ఆర్డీవో రవీంద్రరావు

నందిగామ:నియోజకవర్గంలో తప్పులు లేని ఓటరు జాబితా సిద్ధం చేసేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని ఆర్డీవో ఎ.రవీంద్రరావు సూచించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ఓటరు వెరిఫికేషన్ కార్యక్రమానికి సంబంధించి అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ బీఎల్‌ఓల ద్వారా ఓటర్ వెరిఫికేషన్ జరిగిందన్నారు. వాటిలో జాబితా నుంచి తొలగించిన, బదిలీ చేసిన ఓట్లకు సంబంధించి వెరిఫికేషన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పూర్తిస్థాయిలో పారదర్శకంగా ఈ కార్యక్రమం జరుగుతోందన్నారు. తప్పులు లేని ఓటరు జాబితా సిద్ధం చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులు కూడా సహకరించాలన్నారు. కార్యక్రమంలో పలు పార్టీల నాయకులు, పలువురు తహసీల్దార్‌లు, ఆర్డీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న ఆర్డీవో రవీంద్రరావు

కేఎల్‌యూ విద్యార్థికి జపాన్ ఐటీ కంపెనీలో ఉద్యోగం



ముల్లా అబ్దుల్ ఖాదిర్

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని కేఎల్‌యూ డీమ్డ్ యూనివర్సిటీలో ఈసీఈ చదువుతున్న ముల్లా అబ్దుల్ ఖాదిర్ అనే విద్యార్థి అంతర్జాతీయ స్థాయిలో ఉద్యోగం సాధించినట్లు యూనివర్సిటీ ఉపకులపతి డాక్టర్ సారధి వర్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతర్జాతీయ ఉద్యోగాల కల్పనలో భాగంగా క్యాడ్ వంటి ప్రముఖ సాఫ్ట్‌వేర్‌లను అభివృద్ధి పరిచే సిస్టమ్ మ్యాట్రిక్స్ అనే సాఫ్ట్‌వేర్ కంపెనీలో రూ.26 లక్షల వార్షిక జీతంతో పాటు వసతి, ప్రయాణ ఖర్చులు వంటి పలు రకాల అలవెన్సులను కంపెనీ కల్పిస్తుందన్నారు. విజయవాడకు చెందిన ముల్లా అబ్దుల్ ఖాదిర్ తల్లిదండ్రుల సొంతూరు విజయవాడ అయినప్పటికీ ప్రస్తుతం వారు విదేశాలలో ఉంటున్నారని తెలిపారు. భాషా సమస్య లేకుండా ఉండటం కోసం వర్సిటీలో ఉన్న విదేశీ భాషల విభాగం ఆధ్వర్యంలో విద్యార్థి ఖాదిర్‌కు జపాన్ భాషపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

హుండీ కానుకల లెక్కింపు

తిరువూరు: స్థానిక శ్రీవేంకటాచలస్వామి దేవస్థాన హుండీ కానుకలను మంగళవారం లెక్కించారు. ఐదు నెలల 29రోజులకు రూ.2,85,089 ఆదాయం లభించినట్లు ఆలయ మేనేజరు జన్ను వెంకటేశ్వరరావు తెలిపారు. హుండీ లెక్కింపులో బొర్రగూడెం ఆలయ కార్యనిర్వహణాధికారి సాంబశివరావు, ఆలయ కమిటీ చైర్మన్ ముత్తారావు, సభ్యులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సహకారం

జయంతి(వీరులపాడు): సహకార సంఘంలో సభ్యులుగా ఉండి మృతి చెందిన కుటుంబాలను సహకార సంఘం ఆధ్వర్యంలో ఆర్థికంగా ఆదుకుంటున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ జంగా కోటిరెడ్డి తెలిపారు. మండలంలోని జయంతి గ్రామానికి చెందిన అవులూరి శ్రీనివాసరెడ్డి ఇటీవల మృతి చెందగా అతని కుటుంబానికి సంఘం నుంచి మట్టి ఖర్చులకు మంజూరైన రూ. 10 వేలను మంగళవారం ఆయన అందజేశారు. కార్యక్రమంలో సీఈవో రాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.

వీరాంజనేయస్వామి ఆలయ ఆదాయం రూ.1.31 లక్షలు

మేడూరు(గంపలగూడెం): మేడూరు వీరాంజనేయస్వామి దేవస్థానంలో వివిధ అంశాలకు సంబంధించి మంగళవారం నిర్వహించిన వేలం పాట ద్వారా ఏడాదికి రూ. 1,31,000 ఆదాయం వచ్చినట్లు ఆలయ మేనేజర్ జె.వెంకటేశ్వరరావు తెలిపారు. ఆలయంలో కొబ్బరి చిప్పలు, పాటు, బియ్యం పోగు చేసుకునేందుకు, పొంగలి తయారీకి గ్యాస్ సరఫరాకు నిర్వహించిన వేలం పాటలో గ్రామానికి చెందిన వి.వైష్ణవి అత్యధికంగా రూ.1.31లక్షలకు పాట పాడి కైవసం చేసుకున్నట్లు మేనేజర్ పేర్కొన్నారు. మూడేళ్ల వ్యవధికి నిర్వహించిన పాటను కైవసం చేసుకున్న పాటదారు నిర్ణీత మొత్తంపై తదుపరి రెండేళ్లు 10 శాతం చొప్పున అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. జి.కొండూరు గ్రూపు దేవస్థానాల మేనేజర్ ఎం.మోహనరావు పర్యవేక్షణలో సిబ్బంది లెక్కించారు. ఆలయ కమిటీ చైర్మన్ ముత్యాల రామకృష్ణ పాల్గొన్నారు.

పలు ఆలయాలలో ప్రత్యేక పూజలు

నందిగామ: పట్టణంలోని రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో గల సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఉపాలయంలో స్వామివారికి మంగళవారం పంచామృత అభిషేకాలు నిర్వహించారు. గాంధీనగర్ లోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయంలో స్వామివారికి విశేష పూజలు జరిగాయి. మండలంలోని కూడలి సంగమేశ్వర స్వామి వారి ఆలయం వద్ద గల సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయంలో స్వామివారికి పలు రకాల అభిషేకాలతో పాటు విశేష పూజలు నిర్వహించారు.

నైపుణ్యం పెంచుకుంటేనే ఉద్యోగావకాశాలు

కంచికచర్ల: స్థానిక మిక్ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీలో పాలిటెక్నిక్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు విజయవాడకు చెందిన ఎడ్యునో రోబోట్స్ సంస్థ సహకారంతో రోబోటిక్స్ వర్క్‌షాపు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.వంశీకిరణ్ మంగళవారం తెలిపారు. కార్యక్రమంలో రోబోట్ తయారు చేసే విధానం, రోబోట్ కోడింగ్‌పై ఎడ్యునోరోబోట్ సంస్థ సీఈఓ బాజీబాషా రెండు రోజుల పాటు విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. విద్యార్థులు వినూత్న ఆలోచనలతో పలు రకాల రోబోట్‌ను తయారు చేసి ప్రదర్శించారు. కార్యక్రమంలో పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రాజేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైఎస్సార్ చేయూతతో మహిళలకు స్వయం సమృద్ధి

మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర

జగ్గయ్యపేటఅర్బన్: మహిళా సాధికారతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వైఎస్సార్ చేయూత పథకం ద్వారా మహిళలు స్వయం సమృద్ధి సాధించాలని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర అన్నారు. పట్టణంలోని ప్రభుత్వాస్పత్రి ఎదురుగా వైఎస్సార్ చేయూత సహాయంతో మెప్మా ఆధ్వర్యంలో స్థానిక 5 వ వార్డుకు సంబంధించిన జాస్మిన్ గ్రూప్ డ్వాక్రా మహిళలు ఏర్పాటుచేసుకున్న ఆహా క్యాంటిన్‌ను మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ చేయూత ద్వారా చిరువ్యాపారాలు నిర్వహించుకోవాలనుకునే వారికి ఆహా క్యాంటిన్ వంటివి ఉపయోగకరం అన్నారు.

ఈ క్యాంటిన్‌లో పేదలకు అతి తక్కువ ధరకే అల్పాహారం, భోజన సదుపాయం అందజేస్తారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, కౌన్సిలర్లు వట్టెం మనోహర్, పందుల రోశయ్య, మెప్మా టీఎల్ఎఫ్ ప్రెసిడెంట్ షేక్ మునీర, సీఎంఎం సుజాత, ఎల్‌హెచ్ స్పెషలిస్ట్ సత్యావతి, నాయకులు కాశి కిషోర్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.



ఆహా క్యాంటిన్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు

రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలి

చెవిటికల్లు(కంచికచర్ల): పత్తి పంటలో యాజమాన్య పద్ధతులు పాటించటం ద్వారా సస్యరక్షణ చర్యలు చేపట్టవచ్చని నందిగామ వ్యవసాయ సహాయ సంచాలకుడు కె.శ్రీనివాస్ అన్నారు. మండలంలోని చెవిటికల్లు గ్రామంలోని గ్రామ సచివాలయంలో రైతులతో మంగళవారం వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ పత్తిలో వచ్చే గులాబీ రంగు పురుగు ఉధృతిని అరికట్టడానికి లంగాకర్షక బుట్టలు(పెరమోన్ ట్రాప్స్) ఎకరానికి నాలుగు ఏర్పాటు చేయాలన్నారు. రసం పీల్చే పురుగులు, పచ్చదోమలను నివారించటానికి కిలో విత్తనానికి 9.0 ఎంఎల్ ఇమిడాక్లోప్రిడ్ 600 ఎఫ్ఎస్ లేదా తగినంత జిగురు కలిపి 5.0 గ్రాముల ఇమిడాక్లోప్రిడ్ లేదా 600 ఎఫ్ఎస్ లేదా 5 గ్రాముల థయోమిథాక్సికం 70 డబ్ల్యూఎస్‌తో విత్తన శుద్ధి చేస్తే నెల రోజుల లోపు రసం పీల్చే పురుగులను అరికట్టవచ్చని తెలిపారు. తెల్లదోమల నివారణకు లీటర్ నీటిలో 2 ఎంఎల్ ట్రైజోఫాస్ లేదా ప్రోఫెనోఫాస్ 5 ఎంఎల్ వేప నూనెను కలిపి ఆకుల అడుగు భాగాన పడేటట్లు పిచికారీ చేయించాలని సూచించారు.

కార్యక్రమంలో సర్పంచి బుడ్డి విజయలక్ష్మి, సొసైటీ అధ్యక్షుడు మంగిశెట్టి పుల్లారావు, ఏఓ కె.విజయకుమార్, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.